క్లుప్తంగా

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ఉండి: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎండీ నసీరుల్లా ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఉత్సవాల్లో అశ్లీల నృత్యాలు వంటివి నిర్వహిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మత్తు పదార్థాలను సేవించి గొడవలను ప్రేరేపించడం చేసే వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని ఎస్సై తెలిపారు.

సత్యవతమ్మ సేవలు ఎనలేనివి


కుట్టు మెషీన్లు అందజేస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం (ప్రకాశంచౌక్): పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీపద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి మందిర అధ్యక్షులు కంతేటి వెంకటరాజు తల్లి స్వర్గీయ కంతేటి సత్యవతమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) చేతుల మీదుగా పేద మహిళలకు కుట్టు మెషీన్లు అందించి మాట్లాడారు. సత్యవతమ్మ జీవించి ఉన్నంత వరకు అన్నదానం, ధార్మిక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేవారని, వారి కుటుంబ సభ్యులు వారి పేరిట సేవా కార్యక్రమాలను కొనసాగిస్తుండటం విశేషమన్నారు. ఎమ్మెల్యే అంజిబాబు, జనసేన జిల్లా అధ్యక్షులు కోటికలపూడి గోవిందరావు, టీడీపీ రాష్ట్ర నాయకులు మెంటే పార్థసారథి, మల్లినిడి తిరుమలరావు, ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజులు సత్యవతమ్మ సేవలను కొనియాడారు. కాంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి, సరిపిడకల రామారావు, కుక్కల బాల, వేండ్ర వెంకటస్వామి పాల్గొన్నారు.

'ఉప్పుటేరులో ప్రవాహం పెరిగింది'


ఉప్పుటేరులో ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు రఘురామకృష్ణంరాజు, కామినేని

ఆకివీడు: ఉప్పుటేరులో ప్రవాహ వేగం పెరిగిందని ఉండి, కైకలూరు ఎమ్మెల్యేలు కె.రఘురామకృష్ణంరాజు, కామినేని శ్రీనివాస్ చెప్పారు. ఉప్పుటేరు ప్రాంతాన్ని ఆకివీడు వద్ద ఆదివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ ఉప్పుటేరులో యుద్ధప్రాతిపదికన పొక్లెయిన్‌తో గుర్రపుడెక్క మేటలు తొలగించడం వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. గత వారం రోజులుగా ఉప్పుటేరులో మేటల్ని తొలగించే చర్యలు చేపట్టారన్నారు. రైల్వే వంతెన వద్ద, ఆర్ అండ్ బీ వంతెన వద్ద గుర్రపుడెక్క మేటల్ని తొలగిస్తున్నారన్నారు. దీంతో నీటి ప్రవాహ వేగం పెరిగిందన్నారు. కొల్లేరులో రెండు మూడు అంగుళాలు నీటి మట్టం పెరిగినా పెద్ద ఇబ్బందిలేదని, ఉప్పుటేరు వేగంగా ప్రవహిస్తోందని చెప్పారు. అనంతరం ఆకివీడు వద్ద చినకాపవరం డ్రెయిన్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు ఆక్రమణల్ని తక్షణం తొలగించాలని కమిషనర్ కృష్ణమోహన్‌ను ఆదేశించారు. కూటమి పార్టీల నాయకులు జుత్తిగ నాగరాజు, ముత్యాల రత్నం, అధికారులు పాల్గొన్నారు.

కాలువ ఆక్రమణలు తొలగించండి

కాళ్ల: పంట, మురుగు కాలువలపై ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణంరాజు అధికారులకు సూచించారు. పెదఅమిరంలో ఆక్రమణలకు గురైన కాలువలను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతర తన కార్యాలయంలో అధికారులకు పలు సూచనలు చేశారు. సర్పంచ్‌లు డొక్కు సోమేశ్వరరావు, కొల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రజా కళాకారుడు గరికపాటికి నివాళి

భీమవరం: కళాప్రదర్శనలతో ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు ప్రజా కళాకారుడు డాక్టర్ గరికపాటి రాజారావు కృషి చేశారని ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన గరికపాటి వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటంలో పాటలు, బుర్రకథలు, హరికథలు, నాటకాలు, జానపద కళారూపాల ద్వారా ఎందరో కళాకారులను సమీకరించి ప్రజలను చైతన్యవంతులు చేయడమే కాక ఉచిత వైద్యం చేసి రాజారావు మానవత్వాన్ని చాటారన్నారు. తొలుత రాజారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వేల్పుల నాగేశ్వరావు, చాన్ భాషా, జవ్వాది దాశరధి శ్రీనివాస్, ఆక్వా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వదలని వాన.. తప్పని వరద

- ఉక్కిరిబిక్కిరవుతున్న కొల్లేరు, ఉప్పుటేరు తీరప్రాంత రైతులు
- మళ్లీ ముంపు బారిన పలు మండలాల్లో వరి చేలు, నాట్లు


చినమిల్లిపాడులో మట్టి బస్తాలను పడవలో తీసుకువెళుతున్న గ్రామస్తులు

ఆకివీడు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో బుడమేరు, తమ్మిలేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో కొల్లేరు తీర గ్రామాలకు వరద ముంపు భారీగా ఏర్పడింది. గత మూడు రోజుల నుంచి కొల్లేరు నీటి మట్టం క్రమం పెరుగుతోంది. కొల్లేరు సరస్సు నుంచి ఉప్పుటేరు ద్వారా సముద్రంలోకి ముంపునీరు చొచ్చుకుపోవలసి ఉంది. అయితే ఉప్పుటేరులో పలు చోట్ల తూడు, గుర్రపుడెక్క మేటలు వేయడం, ఉప్పుటేరులో పూడికలు పేరుకుపోవడం, రైల్వే వంతెన, ఎన్‌హెచ్ వంతెన నిర్మాణ సమయంలో ఏర్పడిన మట్టి దిబ్బలతో ఉప్పుటేరు నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. 25 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో ముంపునీటిని సముద్రంలోకి తీసుకుపోయే ఉప్పుటేరు ప్రస్తుతం 8 వేల క్యూసెక్కుల సామర్థ్యానికి పడిపోయింది. దీంతో వరద ఉధృతికి తీర ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. చినమిల్లిపాడులో ముంపు బెడద భారీగా పెరిగింది. ఉప్పుటేరుకు గట్లకు గండి పడకుండా సుమారు 36 ఎకరాల రైతులు తమ పంటను కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే దుంపగడప, సిద్ధాపురం, చినమిల్లిపాడు, అప్పారావుపేట, మందపాడు, చినకాపవరం, పెదకాపవరం, గుమ్ములూరు గ్రామాల్లోకి ముంపు నీరు చొచ్చుకువస్తోంది.

ఉప్పొంగుతున్న చినకాపవరం డ్రెయిన్

మండలంలోని చినకాపవరం డ్రెయిన్ ఉప్పొంగి ప్రవహిస్తోంది. గోదావరి కాలువలోని అదనపు నీటిని వెంకయ్యవయ్యేరు పంట కాల్వలోకి వదిలివేస్తున్నారు. దీనిద్వారా చినకాపవరం డ్రెయిన్‌లోకి ఈ నీరు చేరుతోంది. ఉప్పుటేరులోకి చొచ్చుకువెళ్లాల్సిన చినకాపవరం డ్రెయిన్ నీరు ఎదురు ప్రవహించడంతో తీర ప్రాంతాల్ని ముంచెత్తుతోంది. దీంతో ఆదివారం ఆకివీడు-సిద్ధాపురం రోడ్డును వరద నీరు ముంచెత్తింది. చినమిల్లిపాడులోని వడ్డిగూడెం, దళితపేట వద్ద ముంపునీరు ప్రవేశిస్తోంది. కురుపాక వద్ద లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. దుంపగడప వద్ద పల్లెపాలెం, దళితపేట ప్రాంతాలకు ముంపునీరు చేరుకుంది.

చెరువులకు గండి

కొల్లేరు ముంపునకు గురవడంతో తీరంలోని పలు చేపల చెరువులకు గండ్లు పడ్డాయి. చెరువుల్లోని చేపలు ఉప్పుటేరులోకి కొట్టుకువస్తున్నాయి. స్థానిక ఆర్ అండ్ బీ వంతెన వద్ద, ఏలూరుపాడు వంతెన వద్ద ఉప్పుటేరులోని చేపల్ని మత్స్యకారులు వలలు వేసి పట్టుకుంటున్నారు. అదే ప్రాంతంలో ప్రజలకు విక్రయిస్తున్నారు. అరకిలో సైజు చేప నుంచి నాలుగైదు కేజీల చేపలు కూడా వలలకు చిక్కుతున్నాయి. దీంతో ప్రజలు అధిక సంఖ్యలో వంతెనల వద్దకు చేరి చేపల కొనుగోలుకు ప్రయత్నిస్తున్నారు.

మరోసారి ముంపుబారిన వరి చేలు

ఉండి: భారీ వర్షాలకు మరోసారి వరి పంట నీట మునిగింది. ఆదివారం సాయంత్రం వరకు వర్షం కురుస్తుండటంతో మండల వ్యాప్తంగా 19 గ్రామాల్లోను సుమారుగా రెండువేల ఎకరాల వరిపంట నీటమునిగినట్లు మండల వ్యవసాయాధికారి బీ సంధ్య తెలిపారు. మండలంలో ముఖ్యంగా యండగండి, ఉప్పులూరు, మహదేవపట్నం, పాందువ్వ, కోలమూరు, ఉండి, ఎన్నార్పీ అగ్రహారం గ్రామాల్లో అధికంగా వరిపంట నీట మునిగినట్లు తెలిపారు. అయితే వర్షం ఇంకా కురుస్తుండటంతో ముంపు మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఆమె తెలిపారు. వర్షం తగ్గకపోతే ఈ నష్టం మరింతగా పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. వరి చేలల్లో వర్షపు నీరు బయటకు వెళ్లే అవకాశం లేకపోవడంతో వరి పంట తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రైతులకు తప్పని కష్టాలు

కాళ్ల: తుపానుల ప్రభావంతో జోరుగా వర్షాలు కురుస్తుండటం.. చేలల్లో వర్షం నీరు కిందకు లాగక పోవడంతో ఏమి చేయాలో తెలియక రైతుల తలలు పట్టుకుంటున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు అన్నదాతకు కష్టాలు తప్పడం లేదు. భారీ వర్షాలకు మళ్లీ వరి చేలన్నీ నీట మునిగిపోయాయి. ఆలస్యంగా నాట్లు వేసిన పొలాలన్నీ ముంపు బారిన పడ్డాయి. కాళ్ల లంక, ఏలూరుపాడు, కోపల్లె, కాళ్లకూరు తదితర గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. అయితే ఉప్పుటేరులో ప్రవాహం బిగతన్నితే మరింత నష్టలపాలవుతావని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


ఆకివీడు-సిద్ధాపురం రోడ్డుపైకి వచ్చిన వరద నీరు


పాందువ్వలో నీటమునిగిన వరి చేలు


కాళ్ల లంక ప్రాంతంలో నీట మునిగిన పొలాలు

వలస కార్మికుల రక్షణకు చర్యలు చేపట్టాలి

భీమవరం అర్బన్: వలస కార్మికులకు రక్షణకు చర్యలు చేపట్టి వారికి జీవనోపాధి కల్పించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జేఎన్‌వీ గోపాలన్ డిమాండ్ చేశారు. తోకతిప్పలో ఆదివారం నిర్వహించిన పార్టీ మండల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పనులు లేక ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు కార్మికులు వలస వెళుతున్నారని, అక్కడ వారికి పని ప్రాంతంలో, ప్రయాణాల్లో అనేక ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఎంతమంది వలసలు వెళ్తున్నారన్నది నమోదు కావడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు. మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్, బొడ్డు లక్ష్మీపతి, తిరుమాని నాగేశ్వరరావు, బొడ్డు ఏసు, తిరుమాని సూర్యనారాయణ, నాగిడి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

భార్యాభర్తల మధ్య ఘర్షణ

ఉండి: భార్యభర్తల మధ్య జరిగిన గొడవలో భార్య గాయాలపాలు కావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చెరుకువాడ గ్రామంలో భార్యాభర్తలైన చోబోలు అపర్ణ, మంగన్న మధ్య తలెత్తిన వివాదం ముదిరి భార్యపై భర్త దాడి చేసి గాయపరచాడు. అడ్డుకునేందుకు వచ్చి ఆమె మేనత్త తేజాపైనా భర్తతో పాటు అతని స్నేహితుడు సత్యమూర్తి కూడా దాడి చేశాడు. దీంతో అపర్ణ భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చేరి చికిత్స పొందింది. ఈ మేరకు ఎస్సై ఎండీ నసీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఆలయ గోపురానికి గేట్లు

భీమవరం అర్బన్: గూట్లపాడులోని శ్రీరాజరాజేశ్వరి ఆలయంలో నూతన గోపుర నిర్మాణం వివాదాస్పదంలో ఉంది. గోపుర నిర్మాణం వల్ల తమకు పలు సమస్యలు ఎదురవుతాయని కొప్పర్తి సుబ్రహ్మణ్యేశ్వరరావు, మరికొంతమంది హైకోర్టులో కేసు వేశారు. ఈ వివాదం కోర్టు పరిధిలో ఉన్నా ఆదివారం ఆలయానికి గేట్లు అమర్చారని, అధికారులు చర్యలు చేపట్టాలని బాధితుడు కొప్పర్తి సుబ్రహ్మణ్యేశ్వరరావు కోరుతున్నారు.

ఊరూరా కొలువుదీరిన గణనాథులు

- వాడవాడలా వెలిసిన వినాయక విగ్రహాలు
- కోలాహలంగా చవితి ఉత్సవాలు ప్రారంభం


మెంటేవారితోటలో నైవేద్యంగా సమర్పించిన పిండి వంటలు, స్వీట్స్


భీమవరంలోని ఓ ఇంట్లో నిర్వహించిన చవితి పూజ


ఆకివీడు శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన భారీ వినాయకుడి విగ్రహం


ఆకివీడులో పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద కొలువుదీరిన గణనాథుడు

భీమవరం (ప్రకాశం చౌక్): వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ఊరూరా గణనాథులు కొలువుదీరారు. శనివారం తొలిరోజు ఉత్సవ పందిర్లలో పలు ఆకారాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి చవితి పూజలు నిర్వహించారు. ఇళ్లల్లో సంప్రదాయబద్ధంగా వ్రతం, పూజలు జరిపారు. అలాగే అన్ని వార్డుల్లో ప్రధాన సెంటర్లలో మండపాలను ఏర్పాటు చేసి వినాయకుడిని కొలువుంచి ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. భీమవరంలోని పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. మండపాలు వద్ద పూజలు అనంతరం పలు కళాప్రదర్శనలు, తీన్‌మార్ వాయిద్యాలను ఏర్పాటు చేసి బాణసంచా కాల్పులతో గణేష్ మహారాజ్‌కి జై, గణపతి బప్పా మెరియా.. అంటూ భక్తుల సందడి మధ్య చవితి మహోత్సవాలను ప్రారంభించారు. శ్రీమావుళ్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పందిరిలో వినాయకుని విగ్రహాన్ని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఆయన కుమారుడు సుందర్‌రాజు, ఎమ్మెల్యే అంజిబాబు దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మావుళ్లమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు చిన్ని, ఆలయ సహాయ కమిషనర్ నగేష్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. గునుపూడిలో వేంచేసియున్న శ్రీ విద్యాగణపతి స్వామి వారి ఆలయంలో చవితి మహోత్సవాల శనివారం ఘనంగా ప్రారంభించి శనివారం, ఆదివారం విద్యాగణపతి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి తులసి, పుష్పాలంకరణ నిర్వహించి ప్రత్యేక అలంకరణ పూజలు చేశారు. పంచారామక్షేత్రంలో కొలువైన వినాయకునికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు. మెంటేవారి తోటలోని విజయకనదుర్గ అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న చవితి వేడుకల్లో వినాయకుని శని, ఆదివారం ఆలయ అర్చకులు కొమ్ముశ్రీను ప్రత్యేక పూజలు నిర్వహించారు. బండారు గంగాధర్, లావణ్య దంపతులు స్వామివారికి పలు రకాల పిండి వంటలు, స్వీట్స్ నైవేద్యంగా సమర్పించారు. బలుసుమూడిలో శ్రీసీతారామాజనేయ యూత్ ఆధ్వర్యంలో 12వ వినాయక చవితి వార్షిక మహోత్సవాల్లో భాగంగా శనివారం, ఆదివారం మండపంలో కొలువైన శ్రీ విఘ్నేశ్వరుడికి ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీసీతారామాజనేయ యూత్, పెద్దలు పాల్గొన్నారు.

అట్టహాసంగా చవితి ఉత్సవాల ప్రారంభం

ఆకివీడు: మండలంలో వినాయక చవితి ఉత్సవాలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పలు చోట్ల ప్రత్యేక పందిళ్లు వేసి గణేష్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నారు. స్థానిక శాంతి నగర్‌లో వరసిద్ధి వినాయక ఆలయం వద్ద శనివారం తెల్లవారుజామునుంచి భక్తులు తండోప తండాలుగా వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద ప్రత్యేక విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేసి, ప్రతి రోజూ శాంతిహోమం, లలితా హోమం నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ సప్పా మణికంఠ ఆధ్వర్యంలో ప్రతి రోజూ ప్రత్యేక పూజా కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నారు. పట్టణంలోని పొట్టి శ్రీరాములు సెంటర్‌లో కనకదుర్గమ్మ పూలు పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో, వెలంపేట రామాలయంలో, తీగల దొడ్డి రామాలయం వద్ద, దుంపగడప రోడ్డులో, శ్రీనగర్ కాలనీ, మాదివాడ, సంతపేట, పెద్దింటి అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పందిళ్లు వేసి విఘ్నేశ్వరుడి విగ్రహాలు ఏర్పాటు చేసి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

దండాలయ్య.. ఉండ్రాలయ్యా


కాళ్ల: దండాలయ్య.. ఉండ్రాలయ్య అంటూ గణనాథులకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వినాయక చవితిని పురస్కరించుకుని మండలంలో పలు గ్రామాల్లో పందిర్లు ఏర్పాటు చేసి వివిధ ఆకృతుల్లో గణేశుని విగ్రహాలు నెలకొల్పి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జువ్వల, ఏలూరుపాడు, కాళ్లకూరు, దొడ్డనపూడి ,కాళ్ళ, సీసలి, బొండాడ, పెద అమిరం, కలవపుడి, కోపల్లె తదితర గ్రామాల్లో చవితి వేడుకలను నిర్వాహకులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు.


వైభవంగా చవితి వేడుకలు

ఉండి: వినాయక చవితి వేడుకలు మండల వ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. రెండో రోజు ఆదివారం మండలంలోని పలు గ్రామాలతో పాటు ఉండిలోని వివిధ ప్రాంతాల్లో బొజ్జగణపయ్యకు మండపాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆదివారం మండలపాల్లో కొలువై వున్న వినాయకుడిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు వస్తారని నిర్వాహకులు ఏర్పాట్లు చేయగా, ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురవడంతో కొన్ని చోట్ల మండపాలు వెలవెలబోయాయి. అయితే పలు ప్రాంతాల్లో వర్షాన్ని కూడా లెక్కచేయకుండా భక్తులు పలు చోట్ల పందిర్లలో స్వామివార్లను దర్శించుకుని పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే పలు ప్రాంతాల్లో భజన, సంకీర్తనలతో పాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.


మావుళ్లమ్మ ఆలయం వద్ద వినాయకుడిని దర్శించుకుంటున్న మండలి చైర్మన్ కె.మోషేన్‌రాజు


బలుసుమూడిలో ఏర్పాటు చేసిన భారీ విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు


ఉండి సీతారామపేటలో కొలువు తీరిన బొజ్జగణపయ్య


కోపల్లె ఏర్పాటు చేసిన గణపతి విగ్రహానికి పూజలు చేస్తున్న యువకులు


ఉండి కాపులపేటలో చవితి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

జార్జి ముల్లర్‌కు సన్మానం


మోగల్లులో ముల్లర్‌ను సన్మానించిన దృశ్యం

పాలకోడేరు: సుదీర్ఘ కాలంగా ప్రభువు సేవలో ఉన్న జార్జి ముల్లర్‌కు పదవి లభించడం ఆయన బాధ్యతను మరింత పెంచిందని పలువురు దైవజనులు అన్నారు. ఇటీవల వీరభద్రపురంలో శెట్టిపేట ఫీల్డ్ నూతన కార్యవర్గం ఎంపిక జరిగింది. లోయర్ గోస్తనదీ ఇవాంజెలికల్ ఫెలోషిప్ (ఎల్‌జీఈఎఫ్)కు సంబంధించిన గోదావరి డెల్టా మిషన్ (జీడీఎం) చర్చి నుంచి బ్రదర్ వై.జాజిముల్లర్ అధ్యక్షులుగా ఎంపికైన సందర్భంగా ఆదివారం మోగల్లు జీడీఎం చర్చిలో ఏర్పాటు చేసిన అభినందన సభలో పలువురు ముల్లర్‌కు శుభాకాంక్షలు చెప్పారు. ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. యూపీపీ మండల అధ్యక్షులు గోపే సాల్మన్‌రాజు, కార్యదర్శి కార్యదర్శి ఎ.ఆశాపురాజు, పాస్టర్లు ఎలిషా, సంఘ పెద్దలు యు.కాలేబు, కేఎస్‌జేఆర్ నతానియేల్ (బాబులు), ప్రభాకర్, కడిమికుమార్ పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల అందజేత

భీమవరం (ప్రకాశంచౌక్): విజయవాడ వరద బాధితుల సహాయార్థం పలువురు దాతలు కలెక్టర్ నాగరాణిని కలిసి విరాళాలు అందించారు. భీమవరం హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ బి.గోపాల్‌రాజు, ఎండీ డాక్టర్ కేవీ కృష్ణంరాజు శనివారం కలెక్టర్ చదలవాడ నాగరాణి కలిసి రూ.5 లక్షల చెక్కును అందజేశారు. అలాగే భీమవరం మోహన్ సర్వీస్ స్టేషన్ పెట్రోల్ బంక్ యజమాని కె.బాలకృష్ణంరాజు కలెక్టర్‌కు రూ.2 లక్షల చెక్కును సీఎం రిలీఫ్ ఫండ్ పేరున అందజేశారు. విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు జిల్లా వాసులు ముందుకు వస్తుండటం అభినందనీయమని కలెక్టర్ అన్నారు.


కలెక్టర్‌కు చెక్కును అందజేస్తున్న భీమవరం హాస్పిటల్స్ యాజమాన్యం

ఎమ్మెల్యేకు రూ.2.50 లక్షల విరాళం అందజేత

భీమవరం: రాష్ట్రంలో వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన ప్రజలను ఆదుకోడానికి దాతలందిస్తున్న సహకారం అభినందనీయమని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. వరద బాధితుల సహాయార్థం పట్టణానికి చెందిన వేగేశ్న శివరామరాజు, చింతలపాటి బంగార్రాజు ఆదివారం రూ.2.50 లక్షల ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి సహాయనిధి కోసం సొమ్మును ఎమ్మెల్యేకు అందించారు. అల్లూరి సత్యనారాయణరాజు, నడింపల్లి లక్ష్మీపతిరాజు, ఎస్ఎస్ రావు, కందుల అరవింద్ పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్త ద్వారంపూడి రూ.లక్ష విరాళం

ఉండి: విజయవాడలో వరద బాధితుల సహాయార్థం రూ.లక్ష చెక్కును శనివారం స్థానిక తహసీల్దార్ నాగార్జునకు పారిశ్రామికవేత్త ద్వారంపూడి నారాయణరెడ్డి అందజేశారు. నారాయణరెడ్డి సోదరుడు, ఉండి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సత్తి బ్రహ్మారెడ్డి, డీటీ ఎస్వీఎస్ నాయకుడు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

భీమవరం అర్బన్: గూట్లపాడు గ్రామంలో మద్దా ఫిలిప్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో సేకరించిన విరాళాలతో ఆదివారం విజయవాడలోని వరద భాధితులకు వెయ్యి పాల ప్యాకెట్లు, 100 వాటర్ బాటిల్స్, 500 క్యాండిల్స్, అగ్గిపెట్టెలు పంపిణీ చేశారు. మద్దా ఫిలిప్, సంధి డానియేల్, కాటిక నతానియేల్, మద్దా అనిల్ కుమార్ పాల్గొన్నారు.